క్లుప్తంగా

భూసార పరీక్షలతో రైతులకు మేలు



వర్కూరు వద్ద పొలంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కోడుమూరు రూరల్ : పొలాలను భూసార పరీక్షలు చేయించడం ద్వారా రైతులకెంతో మేలు చేకూరుతుందని కోడుమూరు ఏఓ రవిప్రకాష్ సూచించారు. శనివారం మండలంలోని వర్కూరు గ్రామంలో భూసార పరీక్షల కోసం రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఏఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతుల పొలాల్లో 22మట్టి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. వాటి ఫలితాల ఆధాకరం పొలాల్లో పోషక లోపాలను సరి చేసుకోవడంతో పాటు, ఆయా పంటలను సాగు చేసి మంచి దిగుబడులను సాధించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కోడుమూరులో ర్యాలీని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు

కోడుమూరు : పిల్లలకు చక్కటి పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా పెరుగుదల, ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనాబాను సూచించారు. శనివారం మండలంలోని క్రిష్ణాపురం–1, 2 అంగన్‌వాడీ సెంటర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జన్‌భాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించి, పౌష్టికాహారంపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్యదశలో ఉన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా ఆట, పాట, కథలను నేర్పించడంతో పాటు, పౌష్టికాహారాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భారతి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలలకు, బాలింతలకు అందుతున్న సేవలపై అంగన్‌వాడీ టీచర్లు శనివారం జన భాగిధారి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సి.బెళగల్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి మాట్లాడుతూ.. ప్రజలు గ్రామాలలోని అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అభిషేక్, ఏఎన్‌ఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

21న గ్రామ సచివాలయం ప్రారంభం



కె.నాగలాపురంలో ప్రారంభానికి సిద్ధమైన సచివాలయం

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలోని గ్రామ సచివాలయ భవనాన్ని ఈ నెల 21న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ మాధవీలత తెలిపారు. శనివారం సచివాలయ భవనాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులు 100 శాతం పూర్తి అయ్యాయన్నారు. మండలంలో ఇప్పటికే చనుగొండ్లలో సచివాలయం ప్రారంభమైన వినియోగంలోకి రాగా, నాగలాపురంలోని సచివాలయం రెండవదన్నారు.

'సుంకేసుల'లో 1.152 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శనివారం ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కర్నూలు నగర వాసుల నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు.

ఆణిముత్యాలకు సత్కారం



టాపర్లకు ప్రోత్సహకాలను అందిస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని పర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పి.శేఖర్ అన్నారు. శనివారం పర్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాలలో నిలిచిన కె.వాణి(475) 2. హుస్సేన్ (437) 3. సమీరాబీ(396) లకు నగదు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందించారు.

సాగుకు ఊతం

- ఖరీఫ్‌లో పంట సాగుకు ప్రభుత్వం సాయం
- రైతు భరోసా కింద ఒక్కో రైతు ఖాతాల్లో రూ. 5,500 జమ
- నియోజకవర్గంలో 37,123 మందికి లబ్ధి
- పెట్టుబడికి తప్పిన కష్టాలు

మండలాల వారీగా రైతు భరోసా లబ్ధిదారులు, జమ అయిన సొమ్ము వివరాలు

మండలం	రైతులు	సొమ్ము జమ
కోడుమూరు	9,798	రూ.5,38,89,000
గూడూరు	7,069	రూ.3,88,79,500
సి బెళగల్	10,645	రూ.5,85,47,500
కర్నూలు	9,611	రూ.5,28,60,500
మొత్తం	37,123	రూ.20,41,76,500

కర్నూలు (న్యూటౌన్): గతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందంటే చాలు రైతుల గుండెల్లో గుబులు మొదలయ్యేది. పెట్టుబడుల కోసం అష్టకష్టాలు పడేవారు. తప్పని పరిస్థితిలో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వారికి ఆ కష్టాలు తొలగాయి. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా సర్కారు పంట సాగుకు సాయం అందజేస్తోంది. విత్తుకు ముందే ఈ సాయం అందజేస్తుండటంతో వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ పథకం కింద ఏటా సర్కారు రూ. 13, 500 అందజేస్తోంది. వరుసగా ఇప్పటి వరకు నాలుగు ఏళ్లు అందించిన ప్రభుత్వం తాజాగా ఐదో ఏడాదికి సంబంధించి తొలి విడత సొమ్మును ఇటీవలే రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఒక్కో రైతుకు రూ. 5,500 చొప్పున కోడుమూరు నియోజకవర్గంలో 37,123 మంది రైతులకు రూ. 20,41,76,500 లబ్ధి చేకూరింది.

పండుగలా వ్యవసాయం

గతంలో ఓ ఏడాది అతివృష్టి, మరో ఏడాది అనావృష్టి ఇలా ఏటా ఏదో ఓ కారణంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. దీంతో చాలా మంది వ్యవసాయం వదిలేసే పరిస్థితి వచ్చింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత రైతులకు కలిసివచ్చింది. వ్యవసాయం పండుగలా మారింది. సకాలంలో వర్షాలు కురవడం..దానికితోడు ప్రభుత్వం విత్తు నుంచి పంట కొనుగోలు వరకు అండగా నిలబడుతుండటంతో రైతులకు కష్టాలు తొలగాయి.

సాగుకు సమాయత్తం

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. సర్కారు పెట్టుబడి సాయం అందించడమే కాకుండా సొసైటీల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తోంది. దీంతో నియోజకవర్గంలోని కోడుమూరు, సి. బెళగల్, గూడూరు, కర్నూలు మండలాల్లో కొందరు తొలకరి వర్షాలకే విత్తు వేశారు. చాలా మంది బోరు బావులు కింద పత్తి పంటను సాగు చేస్తున్నారు.



మునగాలపాడులో సాగవుతున్న పత్తిపంట

పెట్టుబడి సాయంతో రైతులకు ఎంతో మేలు



ప్రభుత్వం ఏటా రైతుభరోసా పథకం కింద అందిస్తున్న సాయం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. నియోజకవర్గంలో ఈ ఏడాది తొలి విడతలో 37, 123 మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. ఇది చిన్న, సన్నకారు రైతులకు విత్తనాల కొనుగోలుకు ఉపయోగపడుతుంది. నియోజకవర్గంలో ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, ఉల్లి, మిరప, వరి సాగు చేస్తున్నారు.

– విశ్వనాథ్, వ్యవసాయ అధికారి, కర్నూలు మండలం

అండగా రైతు భరోసా



వైఎస్సార్ రైతు భరోసా పథకం రైతులకు అండగా ఉంది. మా లాంటి చిన్న రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. పెట్టుబడులకు మార్గం దొరికింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు బాగున్నాయి. ధాన్యం కొనుగోలు తరువాత వెంటనే సొమ్ము జమ అవుతోంది. జగనన్న పాలనలో మాలాంటి రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుంది.

– ఆర్ దేవన్న, రైతు, ఆర్‌కే కొంతలపాడు

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చందుపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ డీఎస్సీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హరికృష్ణ, లక్ష్మీనరసింహుడు కోరారు. వారు గ్రామ సర్పంచ్ ఇమ్మానియేల్, గ్రామ పెద్దలు తిమ్మప్ప, మండల యూటీఎఫ్ నాయకుడు కిషోర్‌కుమార్, ఆపాస్ నాయకుడు ఖడ్గంరాజు, పీఎంసీ చైర్మన్ కిషోర్‌కుమార్ నాయుడులతో కలిసి శనివారం ఎంపీడీఓ రాముడుకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న తమపట్ల గ్రామ సచివాలయంలో సంక్షేమ సహాయకుడు చందు దురుసుగా ప్రవర్తించి, పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తమపై పెత్తనం చెలాయించాలని చూస్తూ, తమ విధులకు ఆటంకం కలుగజేశారని చెప్పారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోండి

గడివేముల: మండలంలోని వివిధ గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న పీఎం కిసాన్‌కు ఈ కేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో ఈకేవైసీ పరిశీలించారు. మండలంలోని 14 ఆర్బీకేలలో 352 మంది రైతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 22వ తేదీ లోపల వీఏఏల వద్ద వేలిముద్రలు వేయాలన్నారు. ఈనెల ఆఖరులోగా పీఎం కిసాన్ నిధులను అకౌంట్లలో జమ వేయడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి



సి.బెళగల్ స్త్రీశక్తి భవన్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభ్యున్నతికి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై పొదుపు మహిళలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఎంఎంఎస్ అధ్యక్షురాలు సృజన అధ్యక్షతన మండల వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, మండల అధికారులు, పొదుపు మహిళలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ రాముడు ప్రస్తుతం అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలోని పోలకల్, పలుకుదొడ్డి, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల గ్రామాలలో జగనన్న శాశ్వత భూ సంరక్షణ హక్కు కార్యక్రమంలో భాగంగా భూములను రీ సర్వేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు వీఆర్వోలను సంప్రదించి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ సుమంత్, కెనరా బ్యాంక్ ఆర్‌ఎం రఘువీర, సి.బెళగల్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఏపీఓ లక్ష్మన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

కోరినవారందరికీ పనులు కల్పించండి



అధికారులతో సమీక్షిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో కోరిన వారందరికీ పనులు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని తిప్పాయపల్లె, శకునాల గ్రామాల వద్ద జరుగుతున్న వంకలో పూడికతీత పనులను పీడీతో పాటు, డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి పరిశీలించారు. ఉపాధి పథకంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ గరిష్ట వేతనం రూ.272లు పొందేలా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కాల్వబుగ్గ వద్ద నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లేబర్ బడ్జెట్, హార్టికల్చర్, హౌసింగ్ పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పురోగతిని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, హౌసింగ్ ఏఈ రామయ్య, ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గృహాల బిల్లులు



బూజునూరులో నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏఈ

గడివేముల: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నూతనంగా నిర్మించుకుంటున్న ఇళ్లకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండల పరిధిలోని బూజునూరు గ్రామంలోని జగనన్న లే అవుట్లను, కొత్త ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి శనివారం హౌసింగ్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో ఇంటి స్థలాలు వచ్చిన వారందరూ త్వరలో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. సొంత స్థలంలో ఇంటి నిర్మాణాలు చేసుకున్న లబ్దిదారులను గుర్తించి జియోట్యాగ్ చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను హౌసింగ్ ఏఈ మూర్తి ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో ఇందిర, సర్వేయర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారం చెల్లిస్తాం



రైతుల జాబితాను పరిశీలిస్తున్న జేసీ మౌర్య

ఓర్వకల్లు : విద్యుత్ టవర్ల నిర్మాణంతో నష్టపోతున్న రైతులకు న్యాయమైన పరిహారం చెల్లిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. శనివారం మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం గ్రామాలలో ఆమె పర్యటించారు. సోలార్ విద్యుత్ పరిశ్రమ కోసం భారీ విద్యుత్ టవర్లను రైతుల పొలాలలో నిర్మించడంతో రైతులు వ్యతిరేకించారు. ఈ విషయంపై జేసీ మౌర్య క్షేత్రస్థాయిలో పర్యటించి బాధిత రైతుల జాబితాను పరిశీలించారు. ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన విద్యుత్ టవర్లకు చెల్లించిన పరిహారం కంటే ఎక్కువగా చెల్లిస్తామన్నారు. రైతులు పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని కోరారు.కొందరు రైతులు మా పొలాల్లో టవర్లు వద్దు. మాకు పరిహారం వద్దని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

గూడూరు : పట్టణంలోని పడమర బీసీ కాలనీలో తెలుగు మద్దమ్మ మృతి చెందడంతో ఆమె కుమారుడికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను శనివారం అందించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ నగదును అందజేశారు. మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, 6 వ వార్డు సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి రామకృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

మట్టినమూనాల సేకరణ

కల్లూరు: నెలలో మట్టి నమునా పరీక్షలు చేయడం వల్ల వాటిలోని పోషకాల స్థాయి తెలుస్తుందని ఏఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నాయకల్లు గ్రామంలో మట్టి నమూనాలను సేకరించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే నుంచి గ్రామ వ్యవసాయ సహాయకులు 22 మట్టి నమూనాలను సేకరించి అగ్రి ల్యాబ్‌కు పంపాలన్నారు. నేలలో పోషకాల స్థాయి లేకుంటే పంటల దిగుబడి తగుతుందన్నారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా నత్రజని, భాస్వరం, పోటాషియం, సేంద్రియ కార్బన స్థాయి, పీహెచ్ (ఉదజని సూచిక) స్థాయి తెలుస్తుందన్నారు. నేలలో అధికంగా పీహెచ్ స్థాయి ఉన్నట్లయితే జిప్సం వేసుకోవాలన్నారు.

– పెద్దటేకూరు గ్రామంలో మొక్కజొన్న పంటలో ఎంపీఈఓ డెవిడ్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు విత్తనం వేయడానికి ముందు భూసార పరీక్షలు చేయడం వల్ల కలిగే ఉపయోగాలను రైతులను వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

గూడూరు రూరల్ : మండల పరిధిలోని జూలకల్ గ్రామానికి చెందిన ఉప్పరి రామాంజనేయులు (36) అనే వ్యక్తి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామాంజనేయులు గ్రామంలోని తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్లుగా పత్తి వేసుకుంటున్నా సరైన దిగుబడి రాకపోవడం, కొత్తగా నిర్మించుకున్న ఇంటికి అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే పరిస్థితి కనిపించక జూలకల్–మునగాల రహదారిలో మద్యంలో పురుగుల మందును కలుపుకుని సేవించాడు. అటు వైపుగా వెలుతున్న వారు గమనించి వెళ్లే సరికి రామాంజనేయులు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పవన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరకుని కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- చనుగొండ్లలో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారుడికి సంక్షేమ పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్ : రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా మహిళల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. చనుగొండ్లలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు కొనసాగించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పింఛన్ల సమస్యను తీర్చాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేకు సీపీఎం నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో స్థానికులు కోడుమూరు నుంచి గూడూరుకు బీటీ రోడ్డును వేయాలని, రోడ్డు లేక పోవడంతో రోగులు ఆటోల్లో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి పరచడం జరిగిందని, కోడుమూరు–గూడూరు రోడ్డును అభివృద్ధి కూడా చేసేందుకు వచ్చే నెలలో భూమి పూజ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకునివచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు దౌల, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, నాయకులు మహేశ్వరరెడ్డి, యువరాజు, నరసింహారెడ్డి, రంగయ్య, శీను, ఎంపీడీఓ మాధవీలత, పీఆర్ ఏఈ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసనాయక్, ఏపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

కర్నూలు (న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. అలాగే పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ గవర్నమెంట్‌లో సమస్యలన్నింటికీ పరిష్కరించుకుందామని చెప్పారు. పేదరికంతో నలిగిపోతున్న ప్రజల ఖాతాలో రూ.2.50లక్షల కోట్లు నగదు జమ చేసి వారిని ఆర్థికంగా ముఖ్యమంత్రి ఆదుకున్నారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతభత్యాలిచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 90శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీకే వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు అజాంఖాన్, రాముడు, మాధవీలత, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, ఏఓ విశ్వనాథ్, ఏపీఎం మల్లికార్జున స్వామి, ఏపీఓ మధుబాబు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రాజు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్: ఖరీఫ్ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), ఎంపీఈఓలు గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పోలకల్ గ్రామ సచివాలయంలో కొత్తకోట, బ్రాహ్మణదొడ్డి, ముడుమాల, పోలకల్ తదితర గ్రామాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. సీజనల్‌లో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందజేయాలని, పంట విత్తు, సస్యరక్షణ పద్ధతులను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి గ్రామం సమీపంలోని మెరుగుదొడ్డి వంకలో పేకాట శిబిరంపై శనివారం సిబ్బందితో కలిసి దాడి చేసి 9మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. దాడిలో పేకాట ఆడుతున్న పులకుర్తి గ్రామానికి లక్ష్మన్న, రాజు, గిరిబాబు, దస్తగిరి, రాజేష్, భాస్కర్, మాధవరావు, వెంకటేష్, రవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,100ల నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను రవాణ చేసే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఏఎస్ఐ నాగయ్య అన్నారు. శనివారం వారు పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ మేరకు ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అడిగేవారు లేరని..

- అధికారులు రాకపోవడంతో తెరుచుకోని 'కడా' డివిజన్ కార్యాలయాలు
- పడిగాపులు కాసిన ఆయకట్టు రైతులు



సబ్ డివిజన్ -3,4 కార్యాలయాలకు తాళాలు వేసి ఉన్న దృశ్యం



తెరుచుకోని సబ్ డివిజన్-1 కార్యాలయం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ఎస్సార్బీసీ కాలనీలో ఉన్న కడా (కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) డివిజన్ కార్యాలయాలకు సెలవులు ఇచ్చారేమో. శనివారం ఏకంగా అక్కడ ఉన్న మూడు కార్యాలయాలకు తాళం వేసి ఉన్నారు. ఒక్క అధికారి కూడా ఆఫీసుకు రాలేదు. వివిధ పనుల మీద అధికారుల కోసం వచ్చిన రైతులు గంటల తరబడి కార్యాలయాల వద్ద ఎదురుచూసి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఒక్కో డివిజన్‌లో డీఈఈ స్థాయి అధికారి మొదలుకుని ఇద్దరు జేఈలు, సబార్డినేటర్లు, లస్కర్లతో పాటు దాదాపు 10 మంది పని చేస్తుంటారు. ఇలా మూడు కార్యాలయాల్లో 30 మంది ఉంటారు. వీరంతా శనివారం కార్యాలయం గడప తొక్కలేదు. దీనిపై సబ్ డివిజన్–1 డీఈఈ శ్రీదేవిని వివరణ కోరగా తాము ఫీల్డ్‌కు వచ్చామని కార్యాలయం తెరచి ఉంటారని బదులిచ్చారు. ఆ తర్వాత సాయంత్రం 3.30 గంటలకు డివిజన్–1 కార్యాలయం తెరిచారు.

పశువుల ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



పశు వసతి గృహంలో పశువుల నిర్వహణ గురించి వివరిస్తున్న పశువైద్యాధికారులు

కల్లూరు : పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని బహుళార్ధక పశువైద్యాశాల ఉప సంచాలకులు డాక్టర్ హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో పశు విజ్ఞాన బడి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బహుళార్ధక పశువైద్యాశాల ఉప సంచాలకులు డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రాంతీయ పశు వైద్యశాల శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ట్రైనింగ్ సెంటర్ డాక్టర్లు సతీష్ కుమార్, అరుణాకుమారి హాజరై పశుబీమా గురించి, గొర్రెల, మేకలలో నట్టల నివారణపై గొర్రెల, మేకల యజమానులు, కాపరులకు అవగాహన కల్పించారు. అనంతరం ట్రైనింగ్ డాక్టర్లు తడకనపల్లె గ్రామంలోని పశు వసతి గృహాన్ని సందర్శించి పశువులను పరిశీలించారు. కార్యక్రమంలో చిన్నటేకూరు పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాల్వ లీకేజీ ... పొలాల్లోకి నీరు

- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- వేసవి దక్కులకు ఇబ్బందిగా మారిన వైనం



ప్రధాన కాల్వ నుంచి లీకేజీ అవుతున్న నీరు



తొగర్చేడులో పొలాల్లోకి వెళ్తున్న నీరు

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు కింద ప్రతి ఎకరానికి సాగు నీరు అందించేందుకు బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ఈ బ్లాక్‌ల నిర్వహణకు ప్రత్యేకంగా కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) విభాగం ఏర్పాటు చేసి పర్యవేక్షణకు డీఈ స్థాయి అధికారిని నియమించారు. మండలంలోని 6 బ్లాక్‌ల ద్వారా పొలాలకు సాగు నీరు అందుతుంది. అత్యధికంగా బ్లాక్–1 కింద పాణ్యం, గడివేముల, నంద్యాల మండలాల పరిధిలోని 16,253 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, బ్లాక్ గేటు వద్ద లీకేజీ ఏర్పడటంతో ప్రధాన కాల్వ నుంచి వచ్చే నీరు దిగువనున్న పొలాల్లోకి వృథాగా పోతుంది. కాల్వకు ఉన్న డ్రాప్‌లు పూడ్చినా నీరు ఏ మాత్రం తగ్గడం లేదు. పది రోజుల నుంచి ఈ ప్రవాహం కొనసాగుతుండటతో పొలాలన్నీ నీటిమయమయ్యాయి. వేసవి దుక్కులు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి బ్లాక్–1 గేట్‌కు మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టాలని, లేకపోతే తాము పంటలు వేసుకోలేమని వాపోతున్నారు. కాగా ప్రధాన కాల్వ నుంచి బ్లాక్–1కు నీటి ప్రవాహం తగ్గగానే మరమ్మతు పనులు చేపడతామని ఏఈఈ సుదర్శన్ తెలిపారు. ఈ పనులకు రూ. 5 లక్షలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు.